పరిగి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

తాండూరు: ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

వికారాబాద్: అదనపుకలెక్టర్ రాహుల్‌శర్మకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

కొడంగల్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

హామీలకు కాంగ్రెస్ సర్కార్ ఎగనామం

- ఎల్ఆర్ఎస్ పేరిట వసూళ్లపై బీఆర్‌ఎస్ ఫైర్
- పరిగి, తాండూరు, వికారాబాద్‌లో ధర్నాలు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, పంజుగుల రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్
- కొడంగల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

పరిగి, మార్చి 6 : ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ రెండు నాలుకల ధోరణి అవలం భిస్తున్నదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్ కట్టవద్దని చెప్పిన కాంగ్రెస్ నాయకులు నేడు ప్రభుత్వంలో మంత్రులుగా కొనసాగుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజల నుంచి రూ.20వేల కోట్ల వసూళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేప ట్టడం సరికాదన్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లింపులు లేకుండా ఉచితంగానే స్థలాల క్రమ బద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పరిగిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు చెల్లించవద్దని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేటి మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు సూచించారని, తాము అధి కారంలోకి వస్తే ఉచితంగానే క్రమబద్ధీకరిస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిందన్నారు. ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజల నుంచి ఫీజు వసూలుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. కాంగ్రెస్ రెండు నాలు కల ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కర్రు కాల్చి కాంగ్రెస్‌కు వాత పెడతారన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ పార్టీ ఎగనామం పెడుతుందని ఆయన విమర్శించారు. నిరుద్యోగ యువతకు భృతి నెలకు రూ.4వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేడు అసలు హామీ ఇవ్వలేదని అబ ద్ధాలు ఆడుతుందని దుయ్యబట్టారు. ప్రతి ఇంటికి నెలకు 200 యూనిట్లు కరెంటు ఉచితంగా అందజేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నేడు ఈ హామీ అరకొరగా అమలు చేసేందుకు అనేక సాకులు చెబుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు 90లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, అలాగే కార్డులు లేని వారు లక్షలాది మంది ఉండగా సగం ఇండ్లకు కూడా ఉచిత కరెంటు ఇవ్వకపోవడం ద్వారా హామీకి ఎగనామం పెడుతుం దని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రతిపక్ష పార్టీగా బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడరాదని, కంటికి రెప్పలా పార్టీ కాపాడుకుంటుందని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎల్ ఆర్ఎస్ ఫీజు రద్దు చేసి ఇంటి స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, ఎంపీపీ కరణం అరవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పి.వెంకటయ్య, పీరంపల్లి రాజు, సారా శ్రీనివాస్, మండల ఎంపీటీ సీల ఫోరమ్ అధ్యక్షుడు కె.వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, మాజీ సర్పంచ్‌లు జి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, నల్క జగన్, వెంకటయ్య, ఆర్.శ్రీనివాస్, మండల కో-ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, కౌన్సిలర్లు మునీర్, వారాల రవీంద్ర, వెంక టేశ్, ఎదిరె కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు మాణిక్యం, బి.రవికుమార్, మౌలానా, నయీమ్, తాహెర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: ఇచ్చిన హామి మేరకు కాంగ్రెస్ నేతలు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేప ట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం తాండూరు పట్టణం అంబేద్కర్ చౌక్‌లో బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తాండూరు ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పినట్లు లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ ఆర్ఎ స్)ను ఎలాంటి ఛార్జీలు లేకుండా ఉచితంగా లే అవుట్ రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవడానికి అడ్డమైన హామీలు ఇచ్చి ప్రజలను గందరగోళం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అంటే కష్టాలు... కష్టాలు అంటేనే కాంగ్రెస్ అనేలా రాష్ట్రంలో హస్తం పాలన ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేమి, అనుభవరాహిత్యంతో సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి తయా రైందన్నారు. రూ. వేల కోట్లే లక్ష్యంగా నిరుపేద ప్రజల రక్తం తాగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటైందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవ రకు బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. మోసం చేసిన వారికి ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు రాజూ గౌడ్, వీణ, దీప, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శోభారాణి, సంగీతఠాకూర్, వెంకట్‌రెడ్డి, ఉమాశంకర్, రమేశ్, అనిల్ తదితరులున్నారు.

కొడంగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 90 రోజుల కావస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలు పూర్తి చేయడం లేదని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధ వారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని లేదంటే బీఆర్‌ఎస్ పార్టీ వార్‌కు సిద్ధంగా ఉందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు బట్టి విక్రమార్క, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ తదితరులు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని, అధికారంలోకి మాట మార్చి ఎల్ఆర్ఎస్‌పై వసూళ్లకు సిద్ధం అవుతున్నట్లు ఆరోపిం చారు. ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.20వేల కోట్ల సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇందుకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతుందని, కొడంగల్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా విలేకరుల సమావే శాన్ని ఏర్పాటు చేశామన్నారు. గతంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకా నికి సంబంధించి ప్రాజెక్టు పనులు పూర్తి కాగా రూ. రెండు లేదా మూడువేల కోట్లు వెచ్చిస్తే కాలువల నిర్మాణంతో కొడంగల్ నియోజకవర్గానికి లక్షా 49వేల ఎకరాలకు సాగు నీరు అందేదన్నారు. కొడంగల్-నారాయణపేట ఎత్తి పోతల పథకాన్ని తెర పైకి తీసుకొచ్చి నీళ్లు వచ్చే పథకానికి అడ్డు వేశారన్నారు. జూరాల ప్రాజెక్టులో ఏడు టీఎంసీల నీటి నిల్వలో మూడు టీఎంటీలు డెడ్ స్టోరేజ్‌గా ఉంటుందని, మిగిలిన నాలుగు టీఎంసీల నీటిలో నారాయణపేటలో 80వేల ఎక రాలకు, కొడంగల్‌లో లక్షా 49వేల ఎకరాలకు సాగునీరు ఏవిధంగా సరిపోతుందని ప్రశ్నించారు. హైద రాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వ్యతిరే కించిన ఫ్యాక్టరీలను కొడంగల్ ప్రజ లకు అంటకట్టేందుకు సీఎం చూస్తున్నారని, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించా లనే ఉద్దేశ్యం ఉంటే ఐటీ పార్క్, ఐటీ హబ్, టెక్స్‌టైల్ వంటి వాటిని ఏర్పాటు చేయా లని డిమాండ్ చేశారు. గతంలో ఈ ప్రాం తంలో చెక్ డ్యాంల నిర్మాణానికి బీఆర్ ఎస్ ప్రభుత్వం రూ.70కోట్లు మంజూరు చేసిందన్నారు. మరో రూ. 150కోట్లు మంజూరుతో చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు చేపట్టి చెరు వులను సుందరీకరణ చేసి పర్యా టక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎంపీపీ విజయ్‌కుమార్, జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యా దవ్, బొంరాస్‌పేట మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ బొంరాస్ పేట, దుద్యాల అధ్యక్షులు కోట్ల యాదగిరి, చాంద్‌పాషా, బీఆర్‌ఎస్ నాయకులు నవా జొద్దిన్, ఫయూం, సయ్యద్ అంజద్, రమేశ్‌బాబు. పాల్గొన్నారు.

శివాజీ అడుగుజాడల్లో నడుద్దాం

పెద్దేముల్, మార్చి 6: యువత శివాజీ మహరాజ్ చూపిన మార్గంలో నడిచి ఆద ర్శవంతమైన జీవనాన్ని కొనసాగిం చాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మం డల పరిధిలోని తట్టేపల్లి గ్రామంలో శివాజీ నూతన విగ్రహాన్ని ఆయన స్థానిక నాయకులు, యువకులతో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు స్థాని క యువత రోహిత్‌రెడ్డికి ఘనంగా స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్ర మంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్య క్షుడు కోహిర్ శ్రీనివాస్, తట్టేపల్లి పీఏసీ ఎస్ వైస్‌చైర్మన్ అంజయ్య, బీఆర్‌ఎస్ యువజన అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, భరత్ కుమార్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ధన్‌సింగ్, నాయకులు టి. రమేశ్, లక్ష్మణ్, అంజయ్య, విజయ్‌కు మార్, కె.గోపాల్, సంగమేశ్వర్, రఘు, ప్రసాద్, ఎంపీటీసీ శంకర్, శివాజీ యు వజన సంఘం ప్రతినిధులు, యువకు లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మర్పల్లి, మార్చి 6: ధరణిలో రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్పెషల్ డ్రైవ్ లో భాగంగా వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నా రు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయ న సందర్శించి ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్ర మాన్ని, రెవెన్యూ రికార్డులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదు లను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ గణేశ్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ ఉన్నారు.

ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా

కొడంగల్, మార్చి 6: మున్సిపల్ పరిధి లోని పాత కొడంగల్ ప్రాథమిక పాఠశా లలో నిర్వహించిన టీఎల్ఎం మేళా ఆక ట్టుకున్నది. బుధవారం పాఠశాలలో తెలుగు, గణితం, ఆంగ్ల భాషలకు సం బంధించి అవరోహణ, ఆరోహణ, స్థాన విలువలు, అగ్ని పర్వతం నమూనాల ప్రదర్శనతో పాటు గణిత పోటీలను నిర్వ హించి విజేతలకు బహుమతులను అంద జేశారు. టీఎల్ఎం మేళాలో విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ ఎం క్రాంతికుమార్ మాట్లాడుతూ.. టీఎ ల్ఎం పరికరాల తయారీతో విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు రావడంతో పాటు నేర్చుకున్నది చాలా కాలం పాటు గుర్తుం టుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యురాలు సంధ్య పాల్గొన్నారు.

తండా అభివృద్ధికి చర్యలు

కులకచర్ల, మార్చి 6 : చెరువుముందలి తండా అభివృద్ధికి చర్యలు తీసుకుం టామని నాయకుడు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. బుధవారం కులకచర్ల మం డల పరిధిలోని చెరువు ముందలి తండాలో ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు రవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ పెంటమ్మ, రఘు, చం దర్, రాజు, అనిల్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు భూ కైలాస్ ముస్తాబు

శివపార్వతులు

తాండూరు రూరల్, మార్చి 6 : మండల పరిధిలోని అంతారం తండాలో వెలసిన భూకైలాస్ శివరాత్రిని పురస్కరించుకొని జరిగే బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ ఉత్సవాలకు కర్ణా టక, మహారాష్ట్రతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూ బ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. తాండూరు పట్టణం నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి చేరుకోవడానికి భక్తులు ఆటోలు, ప్రైవేట్ వాహ నాల్లో వస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేయిం చారు. 60 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహం చుట్టూ పలువురు దేవుళ్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

9 శక్తిపీఠాల ఏర్పాటు

భూ కైలాస్‌లో 9 శక్తిపీఠాలు ఉన్నాయి. ఆత్మలింగం, శనిదే వుడు, నవగ్రహాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే ద్వాదశ జ్యోతిర్లింగాలు భక్తులను ఆకట్టుకుంటాయి. నీటిలో ఏర్పాటు చేశారు. ఒక్కో లింగాన్ని దర్శించుకుంటూ భక్తులు వెళ్తారు. శివరాత్రి సందర్భంగా భక్తులకు నిత్యాన్నదానం ఏర్పా టు చేయనున్నారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు

భూ కైలాస్‌లో భారీగా శివుని విగ్రహం

చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని శివాలయ ట్రస్ట్ చైర్మన్ వాసు పవార్ నాయక్ తెలిపారు.

వికారాబాద్, మార్చి 6 : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రామ మందిర్ సమీపంలో ఓం శాంతి వారు ఏర్పాటుచేసిన మహాశివ జయంతి మహోత్సవాల్లో బుధవారం స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓం శాంతి బ్రహ్మకుమారిస్ వారు నిర్వహిస్తున్న మహ శివ జయంతి మహోత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మంజులా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నైబర్‌హుడ్ కేంద్రంలో సామాజిక తనిఖీ

నైబర్‌హుడ్ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ బృందం

బొంరాస్‌పేట, మార్చి 5 : మండల కేంద్రంలోని నైబర్‌హుడ్ కేంద్రంలో బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ భద్రు, బీఆర్‌పీ రజియా కేంద్రంలోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు కలిసి నైబర్‌హుడ్ కేంద్రం నుంచి అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో నైబర్ హుడ్ కేంద్రం సీసీ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికా సాధికారతపై విద్యార్థులకు అవగాహన

దోమ, మార్చి 6 : బాలికా సాధికారతపై పలువురు అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థు లకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని దిర్సంపల్లి ప్రభుత్వ పాఠశాల పీఎంశ్రీ పాఠ శాలగా ఎన్నికైంది. ఈ సందర్భంగా బుధవారం బాలికా సాధికారత, గర్ల్‌చైల్డ్ ఎడ్యుకేషన్ కార్య క్రమంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు, అగ్నిమాపక నివారణ, పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో ఒత్తిడి నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొంపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్ మాట్లా డుతూ.. బాలికా సాధికారతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషికి తగ్గట్లుగా ఆయా పాఠ శాలల ఉపాధ్యాయులు, మెడికల్, పోలీసు సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలు సహాయ సహ కారాలను అందించి చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు ప్రసాద్‌రావు, దోమ మెడికల్ సూపరింటెండెంట్ నిర్మల, పరిగి ఫైర్ సేఫ్టీ అధికారులు పాండురంగం, చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి

పరిగి, మార్చి 6: తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పరిగి ఎంపీడీవో కె.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం పరిగిలోని మండల పరిషత్ కార్యాలయం సమా వేశపు హాలులో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు తాగునీటి సమస్య పరిష్కారంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. పైప్‌లైన్ లీకేజీలు, మరమ్మతు పనులు వెంటనే చేయించాలన్నారు. బోర్లలో నీటి మట్టం తగ్గితే ఫ్లషింగ్ చేయడం, మరిన్ని పైపులు దించడం వంటివి చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ విషయంలో అధికారులం దరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో దయా నంద్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ కిరణ్, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

కులకచర్ల, మార్చి 6 : ఈ నెల చివరి వరకు 100శాతం పన్నులు వసూలు చేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్ అన్నారు. బుధవారం కులకచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరి వరకు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు చేయాలని తెలిపారు. ఇంటి పన్నులు వసూలు చేయాలని దీనికి కావల్సిన పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపీవో ఖరీమ్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కొడంగల్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

-ప్రజా సంఘాల నాయకుల డిమాండ్


దశరథ్ నాయక్‌ను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బొంరాస్‌పేట, మార్చి 6 : గత నెల ఫిబ్రవరి 15వ తేదీన సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజనులు డీజేలతో నిర్వహించిన ర్యాలీకి అనుమతి లేదని బొంరాస్‌పేట మండలం మూడు మామిళ్లతండాకు చెందిన దశరథ్ నాయక్ , నీలేశ్, కిరణ్, గోపాల్ తదితరులపై కేసు నమోదు చేసి వారిని విచక్షణారహితంగా కొట్టిన కొడంగల్ ఎస్సై భరత్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసు కోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్య దర్శి గోవింద్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం వారు తండాలోని దశరథ్‌నాయక్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గురు యువకులను కొట్టిన విషయమై పరిగి డీఎస్పీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు అన్నారు. గిరిజన యువకులు చట్టాలను ఉల్లంఘించినా, తప్పు చేసినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి కానీ పోలీసులు మానవ హక్కులను ఉల్లంఘించే చర్యలకు పాల్పడరాదని అన్నారు. గిరిజన యువకులను కొట్టిన ఘటనపై జిల్లా అధికారులతో కాకుండా ఇతర డివిజన్‌కు చెందిన పోలీస్ అధికారులతో విచారణ చేయించి బాధ్యులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని, గిరిజన యువకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, దశరథ్ నాయక్ కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. నాయ కులు చంద్రయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, అమర్నాత్, మండల పీఆర్టీయూ నాయకులు

కులకచర్ల, మార్చి 6 : పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని పీఆర్‌టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు కడియాల చంద్రశేఖర్, అమర్నాథ్, కులకచర్ల ఎంఈవో అబీబ్‌హైమద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుస్మసముద్రం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పోలినాయుడు మృతి చెందడంతో వారి కుటుంబానికి పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర శాఖ నుంచి లక్ష రూపాయల చెక్కును అంద జేశారు. ఈ కార్య క్రమంలో కులకచర్ల మండల పీఆర్టీయూ అధ్యక్షకార్యదర్శులు గుడాల వెంకటయ్య, బస్వరాజ్, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మారుతి, పరంధాములు, రాష్ట్ర నాయకులు తావుర్య, నర్సింహులు, వెంకటయ్య, జిల్లా నాయకులు మహేశ్వర్‌రెడ్డి, కులకచర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌గౌడ్, ఆంజనేయులు, పీఆర్టీయూ మండల నాయకులు తిరుపతిరెడ్డి, బాలురాథోడ్‌లతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శంకర్, భాస్కర్, గౌరీనాయుడు, బాలయ్య, దాస్య పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది వెంకటేశ్

వికారాబాద్, మార్చి 6 : మహిళల కోసం రూపొందించిన చట్టాలపై విద్యార్థినులకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ వికారాబాద్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్ తెలి పారు. బుధవారం వికారాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అనంత పద్మనాభ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశా లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన, అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి విద్యా ర్థినులే రేపటి మహిళలు అని, వారికి నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్క రించుకోవడంతో పాటు న్యాయ సహాయం పొందేందుకు ఈ చట్టాలు ఎంతో ఉపయో గపడుతాయన్నారు. సీనియర్ న్యాయవాది జయలతారెడ్డి మాట్లాడుతూ.. చిన్న పిల్లల వివాహ నిషేధ చట్టం.. తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉచిత న్యాయ సహా యం కోసం జిల్లా న్యాయ సేవా అధి కార సంస్థను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మందా రిక, సీనియర్ మహిళా న్యాయవాది, సారిక, డెబోరా, మహిళా న్యాయవాదులు, రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు, విద్యా ర్థినులు పాల్గొన్నారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962